క్లుప్తంగా

గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం



పెదవేగి అమ్మ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు శిక్షణ

పెదవేగి : గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా కృషి చేస్తున్నామని అమ్మ అసోసియేషన్ చైర్మన్ చుక్కా అవినాష్‌రాజ్ చెప్పారు. పెదవేగిలో కొన్నేళ్లుగా చుట్టుపక్కల ఉన్న గ్రామీణ ప్రాంత యువత, మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణతోపాటు సబ్సిడీపై మిషన్లలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే 28 బ్యాచ్‌లు పూర్తి చేసుకుని, 29వ బ్యాచ్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మ అసోసియేషన్ సంస్థ చైర్మన్ అవినాష్‌రాజ్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా మహిళలకు ఉపాధి కల్పన కోసం ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చి, సబ్సిడీపై మిషన్లు అందించి, సర్టిఫికెట్లుతో సత్కరిస్తున్నామని చెప్పారు. ఈ సర్టిఫికెట్లతో బ్యాంక్ రుణాలు పొందవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో శిక్షకురాలు కె స్వాతి పాల్గొన్నారు.

దోమతోనే వ్యాధుల వ్యాప్తి



డెంగీ మాసోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

గణపవరం: అన్ని వ్యాధులకు మూలం దోమలేనని, దోమల నివారణతో వ్యాధులకు దూరంగా ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చునని తాడేపల్లిగూడెం డివిజన్ మలేరియా అధికారి వైవి లక్ష్మణరావు అన్నారు. మంగళవారం ఆయన వైద్యసిబ్బందితో కలిసి గణపవరం మండలం కాశిపాడు డెంగీ మాసోత్సవాల్లో భాగంగా దోమల వ్యాప్తి, నివారణ, దోమల నుంచి రక్షణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం చేకూరుతుందని అన్నారు. ఇంటింటికీ వెళ్లి అపరిశుభ్రత, దోమల వ్యాప్తి, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, గ్రామ కార్యదర్శి డి.రామారావు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలల్లో డీఈఓ తనిఖీ

దెందులూరు: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విద్యార్థుల భవిష్యత్తు, విద్యాభివృద్ధితో పాటు అన్ని పాఠశాలల్లో నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంతో విద్యాశాఖ ఆదర్శవంతంగా తీసుకురావాలని జిల్లా విద్యాశాఖాధికారి పీ శ్యామ్ సుందర్ అన్నారు. మంగళవారం దెందులూరు ఉన్నత పాఠశాలలో ఎంఈఓ ఎవీఎస్‌వీ ప్రసాద్, హెచ్‌ఎం పీ.రామశర్మ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలల సముదాయ శిక్షణ కార్యక్రమం, ఉన్నత పాఠశాలల తెలుగు ఉపాధ్యాయులు తెలుగు సబ్జెక్టు కాంప్లెక్స్ శిక్షణ విడివిడిగా నిర్వహించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి శ్యామ్ సుందర్ పాల్గొని ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి

పెదపాడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుల కోసం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను, సంస్కరణలపై విస్తృత ప్రచారం చేసి ప్రజలకు తెలియజేయాలని వైఎస్సార్ సీపీ నాయకుడు, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ డైరక్టరు ముదుగురు సూర్యనారాయణ మంగళవారం తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు మేలు చేయాలని అనేక రకాలైన పథకాలు అమలు చేస్తూ ఆదుకున్నప్పటికీ అధికారుల సమన్వయ లోపం కారణంగా రైతులు సమస్యలను ఎదుర్కొవాల్సి వస్తోందన్నారు. ఈమేరకు వ్యవసాయ శాఖ జేడీకి వినతిపత్రాన్ని అందించారు. ఈ క్రాపులో నమోదులో ఎలాంటి తప్పులు దొర్లకుండా వీఆర్వో, వ్యవసాయ సహాయకుడు సమన్వయంతో చేయాలన్నారు. దీనిపై డీఎస్‌ఓ, కలెక్టరు వినతిపత్రం అందజేస్తామని ఆయన చెప్పారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష



మొయ్యేరులో జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: జిల్లా, రాష్ట్రస్థాయి పరిపాలనను గ్రామాల్లో ప్రజల చెంతకు చేర్చి గాంధీ, అంబేడ్కర్ కలలుగన్న సుపరిపాలన అందిస్తున్న ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం గణపవరం మండలం మొయ్యేరులో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని అక్కడి కక్కడే పరిష్కరించడమే జగనన్న సురక్ష కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమాన్ని అంతా వినియోగించుకోవాలని సూచించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు, నాణ్యమైన సేవలు ఉచితంగా అందుతాయని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హత ఉండి రాకపోతే వారందరికీ న్యాయం చేయడానికి ఈకార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగవలసిన అవసరం లేకుండా 11 రకాల ప్రధాన సర్టిఫికెట్లను ఉచితంగా అందజేస్తున్నామన్నారు.వైఎస్ జగన్‌ను మరొకసారి అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలు, కౌలు రైతులకు గుర్తింపు కార్డులను అందజేశారు. తొలుత మొయ్యేరు సొసైటీ వద్ద అంబేడ్కర్, కాటన్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ అర్ధవరం రాము, సర్పంచ్ దుళ్ల కుటుంబ రావు, మండల ప్రత్యేకాధికారి, శ్రీనివాసరావు, ఉప తహసీల్దార్ సన్యాసి రావు, సొసైటీ అధ్యక్షుడు మాజీ అధ్యక్షుడు గొడవర్తి వెంకటేశ్వరరావు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, సర్పంచ్‌లు పాతంశెట్టి శ్రీను, మల్లంపల్లి సురేష్, పార్టీ నాయకులు వడ్డి ఉమ, మద్దాల రామకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

కుటుంబ శ్రేయస్సే జగనన్న సురక్ష లక్ష్యంగా

పెదపాడు: కుటుంబ శ్రేయస్సే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి తెలిపారు. పెదపాడు మండలంలోని వసంతవాడలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రత్నకుమారి ప్రసంగించారు. గోగుంట సొసైటీ అధ్యక్షుడు భావరాజు సత్యనారాయణ, ఎంపీటీసీ కలపాల ఆదిలక్ష్మి, బత్తుల ఏసురాజు, ఉపసర్పంచ్ చిన్ని శ్రీనివాస ఫణీంద్ర, నాయకులు బత్తుల ఏసురాజు, చింతల ఆనంద్, తుమ్మల గోపాలకృష్ణ, విజయరాజు, పెదపాడు ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి, తహసీల్దార్ జీ విజయ్‌కుమార్ రాజు, ఏపీఎం దాసరి సుమలత, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ప్రజలందరికీ వరం

దెందులూరు: జగనన్న సురక్ష పేద ప్రజలందరికీ వరమని విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, వైఎస్సార్ సీపీ దెందులూరు గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు అన్నారు. మంగళవారం దెందులూరు సచివాలయంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోకల రాంబాబు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సచివాలయాల మండల కన్వీనర్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు మాట్లాడుతూ 11 రకాల సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు. మండల ప్రత్యేకాధికారి ఎస్.కృపావరం, ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి, ఏఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలాదేవి, సర్పంచ్ తోట ఏసమ్మ, తొత్తడి వేదకుమారి, పోకల రాంబాబు, కట్టా ఏసుబాబు లబ్ధిదారులకు 215 ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. సచివాలయ పరిధిలో వంద మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి, ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రియదర్శిని, అసిస్టెంట్ ఇంజనీర్లు చౌదరి, రాజేంద్ర, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.



పెదపాడు: మహిళకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ బత్తుల రత్నకుమారి, నాయకులు



దెందులూరు: సచివాలయంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆపదలో ఆపన్నహస్తం

వలంటీర్లకు వందనం



కంటికి వైద్యం చేయించుకుని మంచంపై ఉన్న ఇంటేటి లూర్థమ్మను పరామర్శిస్తున్న వలంటీర్ కాకుర్ల జానకి

దెందులూరు: ప్రభుత్వం వలంటీర్ల ద్వారా పేదలకు అందించే పెన్షన్ నగదు ఆపద సమయంలో బాధితులకు భరోసా నిస్తోంది. ఆపన్నహస్తంలా వలంటీర్లు ఇతర ప్రాంతాల్లో ఉన్న లబ్ధిదారులకు వద్దకు వెళ్లి ప్రభుత్వ సాయాన్ని, పింఛన్లను అందిస్తున్నారు. అలుగులగూడెంకు చెందిన ఇంటేటి లూర్థమ్మకు కంటిలో రెటీనా సమస్యతో బాధపడుతూ మంచానికే పరిమితమైంది. గ్రామంలోనే వలంటీరు ఆమె వైద్య సేవలకు ఎంతో తోడ్పాటునందిస్తున్నారు. వలంటీర్ కాకుర్ల జానకి సొంత ఖర్చులతో తన పరిధిలోని లబ్ధిదారులు ఆస్పత్రులలో ఉంటే అక్కడికి వెళ్లి పెన్షన్ నగదును అందిస్తోంది. ఆమె సేవలను పలువురు కొనియాడుతున్నారు.

ఆపదలో ఆదుకుంటున్నారు



డబ్బులు లేక ఆర్థికంగా చాలా ఇబ్బందిగా ఉండేది. నా ఏరియా వలంటీర్ కాకుర్ల జానకి ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ నగదును ఎక్కడ ఉన్నా సకాలంలో తీసుకువచ్చి అందిస్తుంది. వైద్య పరంగా, వ్యక్తిగతంగా సహాయ సహకారం అందిస్తుంది. కంటికి వచ్చిన వ్యాధితో బాధపడుతున్న తనకు ఈ పెన్షన్ నగదు మెరుగైన వైద్య చేయించుకోవడానికి ఉపయోగపడుతోంది.

– ఇంటేటి లూర్థమ్మ, పెన్షనర్

వలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమడోలు: అంబర్‌పేటలో రెండు, సూరప్పగూడెంలో ఒకటి ఖాళీగా గ్రామ వలంటీర్ల పోస్టులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి మంగళవారం తెలిపారు.

నోటి శుభ్రతపై శ్రద్ధ చూపాలి



దంత సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దంత కళాశాల బృందం

పెదవేగి : నోటి శుభ్రతపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని ప్రజాదంత విభాగ హెచ్‌ఓడీ ఎం పావన సంధ్య అన్నారు. మంగళవారం దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో ప్రజాదంత ఆరోగ్య వైద్య విభాగం పెదవేగి మండలం ప్రకాష్‌నగర్‌లోని డి సాలెస్ చెవిటి, మూగ ప్రత్యేక పాఠశాల్లో క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నోటి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. బ్రష్ చేసే పద్దతులను వివరించి, విద్యార్థులకు స్క్రీనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాదంత విభాగ హెచ్‌ఓడీ ఎం పావన సంధ్య మాట్లాడుతూ నోటి ఆరోగ్య ప్రాముఖ్యతను తెలిపారు. పాఠశాల సిస్టర్ సూషా మాత్యు మాట్లాడుతూ మూగ, వినికిడి సమస్య ఎటువంటి లోపాలు ఉన్న చిన్నారులకు, తల్లిదండ్రులు లేని పిల్లలకు మంచి చదువు, వసతి కల్పిస్తామని వివరించారు. క్యాంప్ నిర్వహణపై సెయింట్ జోసెఫ్ దంత కళాశాల యాజమాన్యం సెక్రటరీ, కరస్పాండెంట్ ఫాదర్ జి మోజెస్, అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ధర్మరాజు, ప్రిన్సిపాల్ ఎస్ స్లీవరాజు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాదంత వైద్య విభాగ హెచ్‌ఓడీ డాక్టర్ ఎం పావన సంధ్య, ప్రజాదంత వైద్య విభాగ హౌస్ సర్జన్లు, తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు నాల్గో విడత వైఎస్సార్ సున్నా వడ్డీ అమలు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొఠారు అబ్బయ్యచౌదరి



కొఠారు అబ్బయ్యచౌదరి, దెందులూరు ఎమ్మెల్యే

దెందులూరు: డాక్టర్ వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం డ్వాక్రా మహిళలకు వరమని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబంలో తోబుట్టువులా మహిళల ఆర్థికాభివృద్ధి, భద్రతతో కూడిన జీవన విధానం కల్పించే దిశగా పాదయాత్రలో ఇచ్చిన హామీకి కట్టుబడి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలో దెందులూరు మండలంలో 1,751 డ్వాక్రా సంఘాలకు రూ.244.44 లక్షలు, ఏలూరు రూరల్ మండలానికి 842 గ్రూపులకు రూ. 90.22 లక్షలు, పెదపాడు మండలానికి 1,629 గ్రూపులకు రూ. 217.72 లక్షలు, పెదవేగి మండలానికి 2,186 గ్రూపులకు రూ. 299.19 లక్షలు సున్నా వడ్డీ లబ్ధి చేకూరనుంది. నియోజకవర్గంలో 6,408 స్వయం సహాయక సంఘాలకు రూ. 849.58 లక్షలు లబ్ధి నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 26న ఉదయం 11 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో నాల్గవ విడత వైఎస్సార్ సున్నా వడ్డీ కార్యక్రమాన్ని ప్రారంభించి అక్కచెల్లెమ్మలకు లబ్ధి అందిస్తారని అన్నారు. నాల్గవ సంవత్సర వైఎస్సార్ సున్నా వడ్డీ కార్యక్రమాన్ని ఈ నెల 26న ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ నిర్వహిస్తారని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి వివరించారు. రాష్ట్రంలో డ్వాక్రా స్వయం సహాయక సంఘాలతో పాటు దెందులూరు నియోజకవర్గంలో 6,408 స్వయం సహాయక సంఘాల అక్కచెల్లెమ్మలకు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి శుభాకాంక్షలు తెలిపారు.

బీఎల్వోలతో ఇంటింటా ఓటర్ల నమోదు



తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ జయప్రకాష్

దెందులూరు: రాష్ట్ర ఎన్నికల కమిషన్, కలెక్టర్ ఆదేశాల మేరకు దెందులూరు నియోజకవర్గంలో ప్రతి వారంలో ఒకరోజు అన్ని రాజకీయ పార్టీలతో ఎన్నికల నిర్వహణకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్టు దెందులూరు నియోజకవర్గ ఈఆర్‌ఓ, సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ జయప్రకాష్ అన్నారు. మంగళవారం దెందులూరు తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య అధ్యక్షతన అన్ని రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈఆర్‌ఓ జయప్రకాష్ మాట్లాడుతూ బీఎల్వోలు నియోజకవర్గ వ్యాప్తంగా నెల రోజుల పాటు ఇంటింటా ఓటర్ల నమోదు కార్యక్రమం చేస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని ఓటు హక్కు లేనివారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీఎల్‌ఓలు వారి మొబైల్ యాప్‌లో ఓటు దరఖాస్తును నమోదు చేయాలని ఆదేశించామన్నారు.సమీక్ష సమావేశంలో దెందులూరు తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య, దెందులూరు మండల ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శేఖర్‌బాబు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, పాల్గొన్న ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

ఉంగుటూరు: గ్రామాల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం ఉంగుటూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీడీపీకి చెందిన గ్రామాల సర్పంచ్‌లు హాజరై రసాభాస చేసేందుకు ప్రయత్నించారు. చేబ్రోలు సర్పంచ్ రాందె లక్ష్మీసునీత మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 14, 15 ఆర్థిక సంఘం నిధులు గ్రామ పంచాయతీలకు అందలేదని తెలిపారు. సర్పంచ్‌గా పనిచేసిన ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి ఈ విషయంలో న్యాయం చేయాలని కోరారు. సర్పంచ్‌లు పడుతున్న ఇబ్బందులు, ఆందోళనకు సహకరించాలని సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు పుచ్చకాయల విష్ణుమూర్తిని కోరారు. ఎంపీపీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ మండల పరిషత్ నుంచి రూ.60 లక్షల నిధులు కేటాయించి గ్రామాల అభివృద్ధికి సహకరిస్తున్నామన్నారు. మరో రూ.60 లక్షలతో గ్రామాల అభివృద్ధికి మండల పరిషత్ నుంచి ప్రతిపాదనలు తయారు చేసి త్వరలో అందజేస్తామన్నారు. ఎమ్మెల్యే వాసుబాబు తన నిధులను గ్రామాల అభివృద్ధికి కేటాయిస్తున్నారని వివరించారు. సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలు లిఖితపూర్వకంగా అందజేస్తే ఎమ్మెల్యే వాసుబాబు దృష్టికి, కలెక్టర్ దృష్టికి తీసుకువెళతానని ఎంపీపీ సమాధానం ఇచ్చారు. నారాయణపురం సర్పంచ్ దిడ్ల అలకానంద, ఉంగుటూరు సర్పంచ్ బండారు సింధు, చేబ్రోలు సర్పంచ్ రాందే లక్ష్మీసునీతతో ఏకీభవించి ఆందోళన చేశారు. నారాయణపురం సర్పంచ్ దిడ్ల అలకానంద మాట్లాడుతూ గ్రామాల్లో వైఎస్సార్ కాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు దిమ్మల నిర్మాణాన్ని నిలుపుదల చేయడంపై ప్రశ్నించారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఎందుకు బిగించలేదని విద్యుత్ ఏఈ శ్రీరామ్‌ను ప్రశ్నించారు. దానికి సమాధానంగా ఏఈ మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులున్న ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. కాగుపాడు సర్పంచ్ కడియాల సుదీప్ణ మాట్లాడుతూ తమ గ్రామ హైస్కూల్లో ఇద్దరు ఉపాధ్యాయులు కీచకంగా ప్రవర్తిస్తే ఫిర్యాదు చేసినా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. సమావేశంలో తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో ఆంజనేయబాబు, ఈవోపీఆర్‌డీ సంషుద్దీన్, ఎంఈవో కె.శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి, ఎంపీటీసీ ఛాంబర్ అధ్యక్షుడు బండారు. నాగరాజు, ఆయా శాఖల అధికారులు మాట్లాడారు. మండలస్థాయి అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు. సర్పంచ్‌ల భర్తలు, సభ్యులు కానివారు సమావేశంలో పాల్గొనడంపై కొందరు చర్చించుకున్నారు.

హింసకు కారకులను కఠినంగా శిక్షించాలి

పెదవేగి : మణిపూర్‌లో మహిళను వివస్త్రను చేసి పైశాచికంగా మానభంగం చేసి హత్య చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని మాల మహాసేన జాతీయ అధ్యక్షుడు ఆలగ రవికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం పెదవేగిలో మణిపూర్‌లో ఆదివాసీ, గిరిజన, దళిత క్రిస్టియన్ జాతిపై జరుగుతున్న అమానవీయ ఘటనలను వ్యతిరేకిస్తూ స్థానిక నాయకులు తొంటా తాతయ్య 48 గంటల నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో పాల్గొని మద్దతు తెలిపిన మాల మహాసేన జాతీయ అధ్యక్షుడు ఆలగ రవికుమార్ మాట్లాడుతూ మణిపూర్‌లో హింసను వెంటనే ఆపకపోతే దేశవ్యాప్తంగా నిరసన జ్వాలలు వెల్లుతాయని హెచ్చరించారు. తొంటా తాతయ్య మాట్లాడుతూ మహిళలను వేధించడం హేయమైన చర్య అని దీనికి నిరసిస్తూ 48 గంటలు నిరసన చేపట్టానని ఆయన తెలిపారు. ఎంఆర్‌పీఎస్ నేతలు యర్రా నాగమల్లేశ్వరరావు, కొల్లూరి రామకృష్ణ, తనగాల శేఖర్, మద్దాల తిరుపతిరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు స్పందించి కఠిన చర్యలు చేపట్టాలన్నారు. దళిత నేతలు యర్రా నాగమల్లేశ్వరరావు, కొల్లూరి రామకృష్ణ, చలపాక సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి

గణపవరం: మణిపూర్‌లో దళితులపై దాడులు అరికట్టి శాంతి నెలకొల్పాలని, జాతి మత విద్వేషాలను రెచ్చగొట్టేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం గణపవరం మండలం పిప్పరలో జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి, సీఐటీయూ, ఆల్ ఇండియా దళిత రైట్ ఫోరం, అంబేడ్కర్ ఇండియన్ మిషన్, పిప్పర అంబేడ్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేవీపీఎస్ మండల అధ్యక్షుడు చిన్నం చిన నాగేశ్వరరావు, సీఐటీయూ మండల అధ్యక్షుడు ఎం.పెంటారావు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్లపై దుష్ప్రచారం తగదు

దెందులూరు: వలంటీర్లపై దుష్ప్రచారం తగదని పది రోజులుగా పవన్‌కల్యాణ్, చంద్రబాబునాయుడు చేస్తున్న దుష్ప్రచారాన్ని రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, దెందులూరు మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. మంగళవారం కొవ్వలిలో సచివాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొవ్వలి సచివాలయం–1 వలంటీర్ గొరిపర్తి ఏసురాజు బెల్టుషాపు నిర్వహిస్తున్నాడని మద్యం అమ్ముతున్నాడని పచ్చపత్రిక అల్లిన కథనాన్ని తీవ్రంగా ఖండించారు. సచివాలయం పక్కన బడ్డీ కొట్టు పెట్టుకుని వలంటీర్ తల్లిదండ్రులు నాలుగేళ్ల నుంచి జీవిస్తున్నారని అన్నారు. సోమవారం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మృతి చెందితే అంత్యక్రియులకు వచ్చిన వేరే గ్రామాల వారు బడ్డీ షాపు వద్ద మద్యం తాగుతుంటే ఆ షాపు వలంటీర్‌దని, మద్యం విక్రయిస్తున్నాడని వార్తలు ప్రచురించడం క్షమించరాని విషయన్నారు. వలంటీర్ ఏసురాజు మాట్లాడుతూ మద్యం అమ్ముతున్నానంటూ అసత్య ప్రచారం చేయడం బాధాకరమన్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, ఎంపీటీసీ గొరిపర్తి వరలక్ష్మి, సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము, నాయకులు గొరిపర్తి రంగారావు, పోలయ్య పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే అసత్య ప్రచారం

ఏలూరు రూరల్ : చంద్రబాబు పాలనలో ఒక్క పంచాయతీకి రూ.10 లక్షలు మంజూరు చేస్తే పచ్చనేతలు గొప్పలు చెప్పుకున్నారని, నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒకొక్క పంచాయతీకి రూ.10 కోట్లు ఖర్చు చేస్తుంటే, ఓర్వలేక అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఏలూరు ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు దుయ్యబట్టారు. మంగళవారం ఏలూరు మండలం చాటపర్రులో సర్పంచ్ గుడిపూడి రఘు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసిన కోట్ల రూపాయల నిధులతో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాట పట్టించారని కొనియాడారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తేరా ఆనంద్ మాట్లాడుతూ అభివృద్ధిపై చర్చించేందుకు రావాలంటూ సవాల్ విసిరారు. అసత్య ఆరోపణలు చేస్తే గట్టిగా బుద్ధి చెబుతామని వడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ మండల కొండలరావు హెచ్చరించారు.

ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులు

భీమడోలు: ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులని భీమడోలు ఎంఈవో ఈడ్పుగంటి శ్రీనివాసరావు అన్నారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న రెండు రోజుల స్కూలు కాంప్లెక్స్ సమావేశాలను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఇన్‌చార్జి హెచ్‌ఎం ఆహ్మద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో ఈ.శ్రీనివాసరావు మాట్లాడుతూ నిత్యం అభ్యాసకులైన ఉపాధ్యాయులే చక్కని విద్యాబోధన చేస్తారని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని విద్యాబోధన చేసేలా బోధనాభ్యసన పద్ధతులను నేర్చుకోవాలన్నారు. చిన్నారులకు చక్కని విద్యాబోధన అందించి వారిని సమాజ నిర్దేశకులుగా తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం హెచ్‌ఎంలు జి.భాలభాస్కర్, ఎం.శరీన్‌లు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు ఏ విధంగా విద్యాబోధనలో చేయాలో వివరించారు. మండల పరిధిలోని పాఠశాలలకు చెందిన 50శాతం శిక్షణ తరగతులకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో స్కూలు కాంప్లెక్స్ కార్యదర్శి బాలిన సత్యనారాయణ, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

పెదపాడులో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

పెదపాడు: విద్యాశాఖ ఆదేశాల మేరకు పెదపాడులో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహిస్తున్నట్లు పెదపాడు ఎంఈఓలు సబ్బితి నర్సింహమూర్తి, డీవీ రమణ మంగళవారం తెలిపారు. మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంఈఓలు మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని అన్ని రంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ పీ వెంకటేశ్వరరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.